# వీధిబడిచదువు

తాత కృష్ణమూర్తి బి.ఏ;యల్.టి.

"యీ ప్రపంచములో యేమి వస్తువు లుంటవి?"

"ఆవులు."

"డామ్ నాన్సెన్స్, యెంతసేపు ఆవు లేనా? యేమేమిటివుంటవో బాగా ఆలోచించి చెప్పు."

"గేదెలు."

"దట్ విల్ నాట్ డు, మళ్ళీ ఆలోచించి చెప్పు."

"అయితే నాకు తెలియదు."

—కన్యాశుల్కము.

నాకు ఎనిమిదోయేడు, అప్పుడు. రెండో తరగతిలో చదువుతూ ఉండేవాడిని. రోజుకు మూడు పలకపుల్లలు అవసరపడేవని మహా ఉపద్రవంగా చదివేస్తూ ఉండేవాడినని ఊహించకూడదు. చిన్నప్పుడు అసలు చదువంటేనే నాకు తలనొప్పి!

మాబడిలో అందరంకలసి, యించుమించు యిరవైమంది పిల్లలం ఉండేవాళ్లం. ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలుకూడా ఉండేవారు. మొగపిల్లల బడిలోకి అమ్మాయిలను ఎందుకు రానియ్యకూడదో అప్పుడు అనుభవంమీద బోధపడింది నాకు. మొద్దు అబ్బాయిలనుచూసి వాళ్లు నవ్వుతునేవారు. అప్పుడప్పుడు పళ్లికిలించి వెక్కిరించేవారు. కోపంవస్తే సివంగి పిల్లలవలె మీదపడి రక్కేవారుకూడా. మీదు మిక్కిలి, మాస్టరుతో లేనిపోని చాడీలుచెప్పి మమ్ము కొట్టించేవారు. పాఠాలు చురుసుగా అప్పజెప్పేసి, మా మొగపుర్రవాళ్లను చిన్నబుచ్చేవారు. ఆడపిల్లలు కదా అని, పాఠాలు తిన్నగా చదవకపోయినా, బడిలో ఎంత అల్లరిచేసినా, వాళ్లకు దెబ్బలు తగిలేవికావు. వాళ్లమీద ఎప్పుడైనా కోపం వస్తే, పంతులు ఆకోపాన్ని మా మొగమొద్దులమీద అరుస్తునేవాడు, అన్యాయంగా!.........ఇంతకూ, ఆడపిల్లలకు చదువుకోవలసిన గ్రహచారమేం చెప్మా అనిపించేది నాకు. వాళ్లేమైనా ఉద్యోగాలు చెయ్యాలా, అప్పుపత్రాలు రాయాలా? ఆడపిల్లలు చదువుకోవడంనుంచే, మొగపిల్లల తెలివితేట లన్నీ క్షీణించిపోతున్నాయి!........

మా బడిపంతులు పేరు సాంబన్న. ఆయనకు సుమారు యాభైయేళ్లు ఉండేవి. చత్వారంచేత కళ్లకు సులోచనాలు పెట్టుకునేవాడు. అతగాడికి పెళ్లాం, పిల్లలు, ఎవరూలేరు. మనిషి దొడ్డవాడే కాని కించిత్ ప్రథమకోపం ఉండేది. ప్రైమరీ దాకా మాకు చదువుచెప్పేవాడు. అతని యింటి వీధిచావడే మా స్కూలు. ప్రతీయేటా మాకు పరీక్ష జరుగుతూ ఉండేది. క్లాసుకు యింతజీతం అని నిర్ణయంలేదు. ఊళ్లో తక్కినవాళ్లు ఎంతెంత యిచ్చేవారోమానేవారో నాకు తెలియదు కాని, మా నాన్నగారు సాంబన్నకు యేటా కొన్నిధాన్యం, పెసలు, మిరపకాయలు కొలిచేవారు.

సాంబన్న పేరు చెప్తే నాకు వొణుకు! ఇంట్లో అల్లరిచేసినా, ఆయనతోనే ఫిర్యాదు చేసేవారు. బడికి వెళ్లకపోతే అమ్మ కోప్పడేది; వెళితే అయ్యవారు కొట్టేవాడు. 'ముందుకు నుయ్యి, వెనుకకు గొయ్యి!' అన్న సామెతవలె ఉండేది నా అవస్థ. బడిలో చదువుమాట దేవుడెరుగును కాని, శిక్ష చాలా కఠినంగా ఉండేది, తొడపాశాలు, మొట్టికాయలు, వీపుగుద్దులు మొదలైనవి సరేసరి, కోదండం యెక్కించడం, గోడకుర్చీ వేయించడం, ఎండలో నిలబెట్టి పాఠం చదివించడం—యీవిధంగా శిక్షించేవాడు సాంబన్న. పిల్లల్ని ఎంత కొట్టి శిక్షిస్తే, వాళ్లకు అంత బాగా చదువువస్తుందని అభిప్రాయం కాబోలు! అలాగైతే, నేను తిన్న దెబ్బలకు నిజంగా నా కెంత విద్య రావలసింది?

సాంబన్న చేతిలో సర్వకాలసర్వావస్థలయందు బెత్తం ఊగుతూ ఉండేది. ఒకచేత బెత్తం, రెండో చేత సుద్దముక్క పట్టుకొని, చుట్టపొగ కుర్రవాళ్ల మొహాలమీదకి గుప్‌గుప్ మని వొదులుతూ, మాస్టరు నావేపు వస్తూఉంటే, నా పంచ ప్రాణాలు ఎక్కడ ఉండేవో ఆదేవుడికే తెలియాలి. ఎప్పుడైనా స్కూలుకు వెళ్లడం ఎగవేస్తే, ఆమర్నాడు క్లాసు పీకేదాకా గుంజీలు తీయించి, చావజంపి చెవులు మూసేవాడు. పండుగ, పర్వం వచ్చినప్పుడు మాత్రం మావద్ద ఒక్కొక్క కాని పసూలుచేసి, బడికి సెలవిచ్చేవాడు. ఆ విధవపండుగలు ఎప్పుడోకాని రావుకద? మనంకోరిన రోజులలో అయితే అవి అసలే రావు!

"అమ్మా, అమ్మా, రోజూ బడిలో మాస్టరు నన్నెందుకు కొడతాడు?" అని ఒకనాడు మా అమ్మను అడిగాను.

మెల్లగా నవ్వుతూ ఆమె, "పెంకెతనం చెయ్యక బుద్ధిగా చదువుకుంటే కొట్టడు. ఉదయం నేను లేచినవేళకు నువ్వుకూడా లేచి, తులశమ్మకు దండం పెట్టి, మొగం కడుక్కోవాలి. అప్పుడు ఎక్కాలు రాసుకొని, బడికి వెళ్లాలి. నిత్యం ఆమోస్తరుగానే చేస్తే, అయ్యవారు కొట్టడు." అని చెప్పింది.

నాకు ఎక్కాలన్నా, లెక్కలన్నా గండకత్తెర! అందుకనోడు, బడికివెళ్లడంతోనే ముందుగా ఎక్కాలే అడిగేవాడు సాంబన్న. ఆస్కూలులో చదివినంతకాలం నిజంగా నాశరీరం ఎక్కాలకే అప్పజెప్పాను!

ఒకనాడు సాయంత్రం 'ప్రభవా విభవాలు' చెప్పిన తరువాత, సాంబన్న బెత్తంతో నేలమైని తట్టుతూ, "పిల్లల్లారా, ఇటు వినండి — రేపు మీకందరికీ పరీక్ష జరుగుతుంది. పాఠాలు బాగా చదువుకొనిరండి. లేకుంటే, ఇన్‌స్పెక్టరు ఫెయిల్ చేస్తాడు. కుళ్లు గుడలు కట్టుకొని రాక, శుభ్రమైన చాకింటి బట్టలు వేసుకొని రండి." అని గట్టిగా అందరికీ వినిపించేలాగు చెప్పి, బడి విడిచిపెట్టాడు.

హాయిగా పుణ్యక్షేత్రాలన్నీ తిరిగి, అప్పటికి నెలరోజులయింది, మానాయనమ్మ యిల్లుచేరుకొని. వృద్ధాప్యం వచ్చినా, యింకా ఆమె పనిపాట్లు శ్రద్ధగానే చేసేది. వంటలో నిజంగా ఆమెది అమృతహస్తం! ప్రొద్దున్నే యేటినుంచి ఆమె స్నానం చేసివచ్చి, తులసిమొక్కదగ్గర ముగ్గులు పెడుతూ ఉంటే, నేను పరుగెత్తివెళ్లి, "నాన్నమ్మా, యీవాళ మాకు పరీక్షలవుతాయి. వేగరం బడికివెళ్లాలి" అని చెప్పాను.

వేరే అత్తెసరువేసి, ఆమె అందరికన్నా ముందుగా నాకు వడ్డించింది. ఈలోపున మా అమ్మ నాకు తల దువ్వి, నీళ్లుపోసి, నుదుట అగరుముక్క పెట్టింది. ఆవాళ క్రొత్త షెరాయి, పట్టుజుబ్బా తొడుగుకున్నాను. దసరాకి మానాన్న పట్నంలో నాకోసం కొనితెచ్చిన జల్తారు టోపీ పెట్టుకున్నాను. మసిబొగ్గుతో తోమి, ప్రొద్దున్నే పలక శుభ్రంగా కడిగి ఉంచుకున్నాను. క్రొత్త 'పాలపుల్ల', ఎక్కాల బుక్కు, కాపీల పుస్తకం, కరక్కాయ సిరాబుడ్డి, పిట్టకలం, పెన్సిలు, చిన్న దంతంపిడి చాకు — నాసజ్జు యావత్తు పట్టుకొని బడికి బయలుదేరాను.

మా మాస్టరు నల్లని పెద్దకోటు తొడుక్కొని, ఎర్రని పాగాచుట్టాడు. ఇన్‌స్పెక్టరు రామయ్యపంతులు పదకొండు గంటలసరికి బడికి వచ్చాడు.

డిప్టీపను, రేడింగు అయిన పిమ్మట ఆయన పాఠాలలో ప్రశ్నలువెయ్యడం ప్రారంభించాడు.

"ఆవుపాలు ఎట్లాఉండును?"

"తెల్లగాను, మధ్యముగాను ఉండును." అని ఒక కుర్రవాడు చెప్పాడు.

"రైట్. దూడకి ఆవుపాలు ఏవిధముగా ఉండును?
— నెక్స్టు బోయి!"

"మధురముగా ఉండును."

"వెరిగుడ్. 'మధురము' అనగా అర్థమేమి?"

"తీపు." అని ఒక అమ్మాయి చెప్పింది.

"క్వైట్ రైట్. రుచులన్నిటిలోను ముఖ్యమైనది ఏది?" అని రామయ్యపంతులు అడిగాడు ఒక అబ్బాయివేపు తిరిగి.

"పంచదార" అని వాడు చెప్పాడు.

"కాదు. నెక్స్టు?—"

"పాకం బెల్లం!"

"నో,—కాదు."

నేను క్లాసులో వెనకకు కూచుని ఉంటిని. నన్నెప్పుడడుగుతాడా, ఎప్పుడు చెప్పేదునా, అని చాలా ఆతురతగా ఉండేను నాకు. ఎవడు చెప్పిన జబాబూ రామయ్యపంతులుకి నచ్చలేదు. 'తీపు' అని ఒకడు, 'పులుపు' అని మరొకడు, 'కారం' అని యింకొకడు, 'తియ్యతియ్యగా పుల్లపుల్లగా ఉన్నది,' అని వేరొకడు—యీవిధంగా తలా ఒక్కొక్క జబాబు చెప్పారు. ఇంతలో రామయ్యపంతులు నావైఖరి చూశాడు. నేను లేవబోతూ ఉండడం, కూచోడం, పెదివెం లాడించడం, అన్నీ కనిపెట్టి, 'వీడికి తెలిసినట్లుంది!' అని గ్రహించి, నావేపు వేలు చూపించాడు.

"నువ్వు...అబ్బాయి, నీపేరేమిటి?—నువ్వు చెప్పు?" అన్నాడు నన్ను హెచ్చరిస్తూ.

గభాలున నిలబడి, గుక్కవిడవకుండా ఒక్క ఊపిరిని జబాబు చెప్పాను.

"ఈవాళ ప్రొద్దున్న మానాయనమ్మ వంకాయ జిణుగులు, కలిపి వండినముద్దకూర!"

"చబాష్!" అని యిన్స్పెక్టరు కడుపుపట్ట లేకుండా నవ్వేడు.

మా మాస్టరుకికూడా నవ్వువచ్చింది కాని, నవ్వు సమాళించుకుని, నావైపు చురచుర చూడడం ప్రారంభించాడు. క్లాసులో ఉన్న అమ్మాయిలు కూడా మొహాలు ప్రక్కకుతిప్పి, విరగబడి నవ్వుకున్నారు. అప్పుడు నాకు కొంచెం మనసు బాధించింది. కాని వాళ్లు ఎందుకు నవ్వుకుంటున్నారో గ్రహించుకోలేక పోయాను. రామయ్యపంతులు వేసిన ప్రశ్నకు ఎవరూ సరియైన జబాబు చెప్పలేనప్పుడు, నేను చెప్పగలిగినాను కదా అని బ్రహ్మానందభరితుడనై కూర్చున్నాను.

మధ్యాహ్నం లెక్కలపరీక్ష. ఉదయం నేను చెప్పిన జబాబుకి చాలాసంతోషించి కాబోలు, "వీడు చాలా చురుకైన కుర్రవాడివలె ఉన్నాడు." అని తలచి, రామయ్యపంతులు రెండోపూట వచ్చీ రావడంతోనే, తక్కినవాళ్లను ప్రశ్నించక నన్ను పరీక్షచెయ్యడం ప్రారంభించాడు.

"అబ్బాయీ, పళ్లెంలో మూడు మిఠాయి ఉండలు ఉన్నవనుకో, పిల్లివచ్చి ఒకటి యెత్తుకొని పోతుంది. ఇంకా ఎన్ని ఉండలు మిగులుతవి?"

"అన్నీ మిగులుతాయి." అని బదులుపలికినాను.

"అన్నీ ఎట్లా మిగులుతవి? పిల్లి ఒకఉండ యెత్తుకొ పోతుందిగా?"

"పిల్లిని నేను పళ్లెందగ్గిరికి రానియ్యను. కర్రతో కొట్టి తోలేస్తాను." అన్నాను.

రామయ్యపంతులు తనలో నవ్వుకొని, "నువ్వు అప్పుడు యింట్లో లేవనుకో, పిల్లివచ్చి ఒకటి తినేస్తుంది. ఇంకా ఎన్నిఉండలు ఉంటాయి?" అని గట్టిగా అడిగాడు.

"నేను లేకపోతే మా అమ్మ ఉంటుంది. ఆమె లేకపోతే మానాన్న ఉంటాడు. నౌకర్లు ఉంటారు. ఎవరున్నా లేకపోయినా, మానాయినమ్మ తప్పకుండా సావిట్లో కూచుంటుంది కదా, పిల్లివచ్చి మిఠాయి ఉండలు ఎత్తుకొపోతూఉంటే చూస్తూ ఊరుకుంటుందీ?"

ఇన్స్పెక్టరుకు కోపం వచ్చింది. కళ్లెర్రజేసి నావేపుచూస్తూ, "అబ్బాయీ, ఎవరూచూడకుండా వచ్చి, పిల్లితినేస్తుందనుకో." అని బోధపరిచాడు.

"అయితే ఒకటీ ఉండను." అన్నాను.

"ఏమి? మూడుఉండలలోను పిల్లి ఒక్కటేగా తింటుంది?"

"ఎవరూ చూడకుండా ఉంటే, పిల్లి ఒక్కఉండ మాత్రం తిని వెళ్లిపోతుందీ? అన్నీ కాజేస్తుంది." అని చెప్పాను.

"అదికాదు. పిల్లి ఒక ఉండ తినగానే నువ్వు లోపలికి వచ్చావనుకో మిగతావి తిననియ్యకుండా పిల్లిని తోలేస్తావనుకో. అప్పుడో?"

"అప్పుడైనా ఒకటీమిగలదు. ఏమంటే, ఆమిగిలిన రెండుఉండలూ నేనుతినేస్తాను. నాకు మితాయి ఉండలంటే మహాయిష్టం."

రామయ్యపంతులు నవ్వి. "సరే కూర్చో." అన్నాడు.

బడివిడిచీగానే పరుగునవెళ్లి, మానాయనమ్మతో పరీక్షసంగతులన్నీ చెబుతూ ఉంటే, అమ్మవచ్చి నావనక నిల్చుంది. కొంతసేపు నాకబుర్లువిని, "ఇట్లారా నాతో." అని తనగదిలోకి తోడ్కుపోయింది.

ఏదో తినేందుకు యిస్తుందికాబోలని సంబరపడ్డాను. గోడా స్కూలునుండి సాయంత్రం యింటికి రాగానే, నాకు యేదైనా ఫలహారం లభించడం మామూలు. ఏదీ లేనప్పుడు మానాయనమ్మనడిగితే, రాత్రికి తన ఫలహారానికి చేసుకున్న రొట్టెముక్కో, ఉప్పుపిండో, పొంగరాలో— ఏదో ఒకటి యిచ్చేది. నాకు చేగోడీలు, జంతికలు, చక్కిలాలు, మొదలైన చిరితిళ్లంటే చాలా యిష్టం. కాని అవి అజీర్ణం వస్తువులనీ, అనాగరిక భక్ష్యాలనీ కాబోలు, మా అమ్మ నన్ను అట్టే తిననిచ్చేదికాదు. పాలుముంజలు, హల్వా, రవ్వలాడు, కోవాబిళ్లలు, మొదలైన నాజూకు పిండివంటలన్నీ చేయించేది ఫలహారానికి. పట్నంనుంచి నాకోసం బిస్కట్ డబ్బాలు, పిప్పరమింట్లు, చాకొలెట్లు తెప్పించేది. నెలనెలకీ గిన్నెడేసి ఆవీదం తాగించేది నాచేత!

"అమ్మా, తినేందికి ఏమైనా ఇయ్యవ్?" అని చెయ్యి చాచేను.

"ఈవాళ యేమీలేదు. కావలస్తే పాలు, మీగడ గిన్నెలో తీసియిస్తాను; పంచదారవేసుకొని తిను. నిన్నటి కోరుండలు రెండు గూట్లో దాచి ఉంచితే, పిల్లి యెత్తుకొపోయింది."

"రెండూ తినేసిందీ?" అని అడిగాను.

"పూర్తిగా! ఒక పిసరైనా మిగల్చలేదు." అన్నాది.

"అలాగా? అయితే పోనీలే కాని, అమ్మా, యిటువిను. నాకేమీ తినేందికి వొద్దులే. ఈవాళ యిన్స్పెక్టరు పరీక్షచెయ్యడానికి వచ్చేడా, నన్ను నోటి లెక్కలడిగాడు. 'పళ్లెంలో మితాయి ఉండలు మూడు ఉంటే, పిల్లి యెవరూ చూడకుండా వచ్చి ఒకటి యెత్తుకొపోతే, యింకా ఎన్ని ఉండలు మిగులుతాయి?' అని అడిగాడు పిల్లి అన్నీ తినేస్తుంది కదూ? కాబట్టి 'ఒకటీ మిగలదు.' అని జవాబు చెప్పాను. మాహా మరి,...నువ్వు కోరుండలు దాచితే, యేంచేసింది పిల్లి? అలాగే—"

నామాటలు విని మా అమ్మ మెల్లగా నవ్వింది.

"అయితే పరీక్ష పాస్ అయినావా, లేదా? అని అడిగింది, మీద చెయ్యివేసి.

"ఏమో!"

ఆమె దయతో నాశిరస్సు నిమురుతూ, "నువ్వు బాగా చదువుకొని, పెద్దపెద్ద పరీక్షలు పాస్ అయితే నాకు సంతోషంగా ఉంటుంది. రేపటినుంచి నీకు యింటిపద్ద చదువు చెప్తాను నేను; నేర్చుకుంటావూ?" అన్నాది. "ఓ అలాగైతే మరి సాంబన్న బడికి నేను వెళ్ళనక్కరలేదన్నమాట!" అని చంకలు గుద్దుకున్నాను.

"వెళ్ళాలి." అన్నాది ఆమె, నవ్వుతూ. "బడికి వెళితే కాని చదువురాదే, అమ్మా? ఎక్కాలు, దెబ్బలు, ఆడపిల్లల నవ్వులు—ఇవి తప్పవూ మరి?" అన్నాను గునుస్తూ.